దోపిడీకి
గుర్రైన అతను
వేసిన
ఎత్తుకు పై ఎత్తు?

పసలపూడి
వెంకటరత్నం
కథ

# అవినీతి కాటేసింది

కూతవేసి రైలు ఆగింది. రైల్వేస్టేషన్ అంతా హడావిడిగా వుంది. దిగేవాళ్లు దిగుతున్నారు. ఎక్కేవాళ్లు వారి ప్రయత్నం లో అడ్డువచ్చిన వారిని ప్రక్కకుతోసి మరీ ముందుకెళుతున్నారు.

"చాయ్! చాయ్!"

"సిగరెట్, సిగరెట్"

"కేలా కేలా" లాంటి అరుపులతో. కేకలతో నిండివుంది స్టేషనంతా!

'రేయ్! ఎవడ్రా నువ్వు! ఏం చేస్తున్నావ్?" రైల్వే పోలీసు వెంకటస్వామి ఒక కుర్రాడ్ని గద్దించాడు.

వయసు పది పన్నెండు సంవత్సరాల మధ్య వుండవచ్చు. చిరిగిపోయిన నిక్కరు, బూడిద రంగులో ఒళ్ళు ఎన్నో రోజులుగా స్నానం లేదనడానికి నిదర్శనం. తైల సంస్కారం లేని జుట్టు, చింపిరితల, చొక్కాలేదు. ఇదే ఆ కుర్రాడి ఆకారం.

వెంకటస్వామి గద్దింపు విని అదిరిపడ్డాడు ఆ కుర్రాడు భయం భయంగా చూశాడు.

"ఏరా! వినబడలేదా? మాట్లాడవేరా?"

"... ..."

"ఇలా రా!"

అదే భయంతో బెదురుతూ దగ్గరకు వచ్చాడు.

"నీ పేరేట్రా?"

"... ..."

"మాట్లాడవేరా?... కొడకా!" అని ఆ కుర్రాడి జుట్టు పట్టుకున్నాడు.

"కొట్టకండయ్యా! మీ కాళ్లు పట్టుకొంటాను. కొట్టకండి" అని వెంకటస్వామి గుప్పిట నుండి జుట్టు విడిపించుకున్నాడు.



"నా పేరు వెంక్రటావంటారండి. అమ్మా నాన్న లేరండి. ఇక్కడే స్టేషన్లో అడుక్కుంటువ్నానండి. నన్ను కొట్టకండి! వొదిలేయండి" అని బతిమాలాడు.

అవి నెలాఖరు రోజులని గుర్తుకొచ్చింది వెంకటస్వామికి.

"నీలాంటి వాళ్లను చాలామందిని చూశా మరా! నా కొడకా! బొక్కలో తోసేత్తాను.

తియ్యి! జేబు ఎత్తుగావుందే ఏముందో బయటికి తియ్యి!''

''తియ్యరా!'' వెంకటస్వామి లాఠీ ఆ కుర్రాడి వీపుమ తాకింది.

ఆ బాధను తట్టుకుంటూ ఏడుస్తూ జేబులోది బయటకు తీశాడు.

డబ్బు! అన్నీ పది రూపాయల నోట్లే! మొత్తం ఎనభై రూపాయలు.

చటుక్కున ఆ కుర్రాడి చేతిలోని డబ్బు వెంకటస్వామి లాక్కున్నాడు.

''ఎక్కడిదిరా? నీకింత డబ్బు. ఎక్కడ కన్నం వేశావురా? యుడియట్! చెప్పరా! నదు స్టేషన్‌కు. మక్కెలిరగ తంతా!''

ఏడుస్తున్నాడు ఆ కుర్రాడు. ''అయ్యా నన్నొదిలేయండి. కావాలంటే ఆ డబ్బులిచ్చేత్తా. నన్నొదిలేయండి. నేను ఎక్కడా కన్నమేయలేదండి''

తన ఇంట్లో తన భార్య చెప్పిన విషయం గుర్తుకొచ్చింది వెంకటస్వామికి. ఆ కుర్రాడు జేబులో డబ్బు అంతా ఇచ్చేస్తాననడంతో.

''ఏమయ్యా! ఈరోజు పట్నం మంచి మా తమ్ముడు రాంబాబు వస్తున్నాడు. మాంసం కూర, కోడివేపుడు చేయాలి వచ్చేటప్పుడు తీసుకురా!''

అసలే నెలాఖరు రోజులు. జేబులో డబ్బులు లేవు.

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ డబ్బులో మాంసం తీసుకుని వెళ్ళవచ్చు అనుకున్నాడు మనసులో.

అనుకున్న వెంటనే —

''చెప్పు! చెప్పరా! ఎక్కడ కన్నం వేశావో?''

వెంకటస్వామి కంఠంలో మరికాస్త కఠినత్వం చోటు చేసుకుంది.

కుర్రాడు మొత్తుకుంటూనే వున్నాడు.

అక్కడనుండి ఆ కుర్రాడ్ని బరబరా కొంతదూరం ఈడ్చుకెళ్ళాడు. వెంకటస్వామి చుట్టూ చూశాడు.

ఎవరూ తనని గమనించడంలేదని నిర్ధారణ చేసుకొన్నాడు. వెంటనే 80 రూపాయలు తన జేబులో కుక్కుకున్నాడు.

''పోరా! ఫో! వెధవా. ఇంకెపుడూ దొంగతనాలు చేయకు. బుద్ధిగా బతుకు!'' అని ఒక తోపుతోశాడు.

కుర్రాడికి చాలా బాధ వేసింది. చేయని దొంగతనం మీద పడింది. అనవసరంగా లాఠీదెబ్బలు తిన్నాడు. వెంకటస్వామి చేత చీత్కారాలు, తిట్లు తిన్నాడు. న్యాయంగా సంపాదించిన డబ్బు వెంకటస్వామి కొట్టేశాడు. వెంకటస్వామి కంటే పెద్ద దొంగ మరెవరూ లేరు అని ఏదోవిధంగా వెంకటస్వామిని దెబ్బ తీయాలనుకున్నాడు.

వెంటనే వెంకటస్వామి ఇంటికెళ్ళి వెంకటస్వామి భార్యతో —

''ఏమండీ! వెంకటస్వామిగారు మీకు ఒక చీర తీసుకుని కొంచెం ఆలస్యంగా ఇంటికి వస్తానని చెప్పమన్నారండి''. అని చెప్పి తుర్రుమన్నాడు. ఇక ఆ తర్వాత వెంకటస్వామి ఇంట్లో ఏం జరుగుతుందో కుర్రాడికి తెలుసు.

ఆలస్యంగా కాకపోయినా మామూలుగానే ఇంటికి వెళ్లాడు వెంకటస్వామి.

కొత్తచీర కోసం ఎంతో ఆశతో గుమ్మంలోనే వెంకటస్వామిని నిలబెట్టి—

"చీర ఏది?" అని అడిగింది.

"చీరా? చీర ఏమిటే?" ఎంతో ఆశ్చర్యం వెంకటస్వామి కంఠంలో

ఇక అందుకుంది వెంకటస్వామి భార్య—

"ఏ ముం... కిచ్చావు చీర? నాకు అన్యాయం చేస్తున్నాడురో దేముడో..."

ఇంకా శాపవార్థాలు పెడుతూనే ఉంది.

ఈ తతంగమంతా ప్రక్కనుంచి చూసి తృప్తిగా వెళ్ళిపోయాడు ఆ కుర్రాడు.

*




